క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా 11కేవీ నర్సింహ్మాపురి కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింహ్మాపురి కాలనీ, హుడాకాలనీ, డాక్టర్స్‌కాలనీ రోడ్ నెం-1 నుంచి 4 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కందుకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఐ కృష్ణంరాజు పాల్గొని విద్యార్థులకు భవిష్యత్‌లో ఎదగడానికి ఉపయోగపడే మార్గాలను గురించి అవగాహన కల్పించారు. రాబోయే ఆరేళ్లు కష్టపడి చదివితే భవిష్యత్‌లో సుఖపడతారని ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. కాగా క్రీడల్లో రాణించిన విద్యార్థులకు స్థానిక మెడికల్ షాపు నిర్వాహకుడు గణేష్ బహుమతులు అందజేశారు.

రామలింగేశ్వర ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

మాడ్గుల: మండలంలోని కొల్కులపల్లిలో నూతనంగా పునఃనిర్మాణం చేపట్టిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి గురువారం డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా రూ.2.51 లక్షల విరాళం అందజేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున జరిగిన పూజకార్యక్రమాలకు గంప వెంకటేశ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయనిర్వాహకులకు ఆయన విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ కిషన్‌రెడ్డి, నర్సిరెడ్డి, ధర్మారెడ్డి, అర్థం చంద్రయ్య, రవి, రాములు, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సేవా కార్యక్రమాలు

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: రాజకీయాలకతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. విద్య, ఉపాధే లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్‌ను నెలకొల్పామన్నారు. మండల పరిధిలోని పడమటితండా పంచాయతీ తాళ్లగుట్ట తండాలో గురువారం ఆయన పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. తండాభివృద్ధికి సహకరిస్తానని భరోసా పలికారు. తండాలో అసంపూర్తిగా ఉన్న సేవాలాల్, మేరమ్మ, మహంకాళి, దేవాలయాల మరమ్మతుల కోసం ఐక్యతా ఫౌండేషన్ ద్వారా అవసరమైన నిధులు మంజూర్ చేయిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు రాఘవేదంర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుజ్జి, అనురాధ, నరేందర్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్‌యాదవ్, కృష్ణనాయక్, పూల్యానాయక్, రాము, రతన్, కన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయండి: కార్పొరేటర్

హస్తినాపురం: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మనిలాల్, శశిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బాజర్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమోటా (లోకల్) ఒక కిలో రూ.15, (618 రకం) రూ.15, వంకాయ రూ.26, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.50, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.09, కారెట్ రూ.20, దొండ రూ.35, ఆలుగడ్డ రూ. 20, ఉల్లి రూ.19, గోకర రూ.40, దోస రూ.25, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడు రూ.50, ఆర్వి రూ.70, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.33, బీట్‌రూట్ రూ.15, కీర రూ.18, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.45. ఈరోజు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సెల్లార్లలో వ్యాపారం

- రోడ్లపై వాహనాల పార్కింగ్
- పట్టించుకోని జీహెచ్ఎంసీ
- అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అంతే సంగతులు

హుడాకాంప్లెక్స్: జంటనగరాల్లో తరచూ ఎక్కడో ఓ చోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సెల్లార్లలో ప్రమాదాలు జరిగినప్పుడు.. ఊపిరి ఆడక ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కోట్లాది రూపాయల ఆస్తులు అగ్ని కీలల్లో బూడిదగా మారుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు.. కనీస ప్రమాణాలు పాటించకుండా.. పార్కింగ్ కోసం వదిలిన నెలమాలిగల్లో వ్యాపారం చేస్తున్నారు. రూ. లక్షలు, కోట్లు దండుకొంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు అటువైపు చూసిన దాఖలాలు లేవనే విమర్శలు వస్తున్నాయి. ఏదైనా విపత్తు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే జీహెచ్ఎంసీ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది.. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్న అపవాదును మూటగట్టుకున్నారు.

ప్రమాదాలకు నెలవుగా సెల్లార్లు

పార్కింగ్ కోసం వదిలిన సెల్లార్లలో దుకాణాలు వెలసి.. కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయి, ప్రమాదాలకు నెలవుగా మారినా.. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్ల సెల్లార్లలో వ్యాపారం చేసుకుంటూ.. గ్రేటర్ ఖజానాకు గండి కొడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోగా.. ప్రమాదాలు జరిగినప్పుడు ఒకరిపై ఒకరు నిందలు మోపుతూ కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. కొందరు ఇంటి అనుమతులు తీసుకొని కమర్షియల్‌గా కాంప్లెక్స్‌గా మార్చుకొంటూ.. రూ. లక్షల్లో అద్దెలు దండుకుంటున్నారు. కనీస ప్రమాణాలు గాలికి వదిలేసి.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పట్టించుకోక పోవడం దారుణమని, ఇప్పటికైనా సెల్లార్లలో నిర్వహించే వ్యాపారాలను నిలువరించాలని నెటిజన్లు కోరుతున్నారు. అంతే కాకుండా ఫైర్‌సేఫ్టీ లేని షాపింగ్ మాల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



సరూర్‌నగర్‌లో సెల్లార్లలో కొనసాగుతున్న దుకాణాలు

కబరస్థాన్‌ను కబ్జా నుంచి కాపాడండి

నాయబ్ తహసీల్దార్‌కు మైనార్టీ నేతల వినతి



వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

కందుకూరు: మండలంలోని బైరాగిగూడ పరిధిలోని కబరస్థాన్‌ను కబ్జా బారి నుంచి కాపాడాలని కోరుతూ గురువారం కందుకూరు నాయబ్ తహసీల్దార్ తాజుద్దీన్‌కు మైనార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2018లో మంత్రి సబితారెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కబరస్థాన్‌కు హద్దులు నిర్ణయించారన్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ చేపట్టిన వెంచర్‌లో పనులు చేసే వారు కబరస్థాన్ హద్దులు చెరిపేసి మట్టిపోసి.. జెండాలు పాతుతూ ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. అక్కడ వందేళ్ల నుంచి సమాధులు ఉన్నాయన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అంతకు ముందు జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎంఏ.సమీర్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.సులేమాన్, ఉప సర్పంచ్ వెంకటేష్, ఆయా పార్టీల నాయకులు కాజామోహినుద్దీన్, ఎండీ.ఖదీర్, ఎండీ నిజామ్, అఫ్జల్‌బేగ్, అందుగుల కుమార్, మైసయ్య, జి.సామయ్య, భగవంత్, యాదయ్య తదితరులు ఖబరిస్తాన్‌ను పరిశీలించారు. కబరస్థాన్‌ను ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

రేపు భూ న్యాయ శిబిరం

యాచారం: యాచారం మండల కేంద్రంలో శనివారం లీఫ్స్ గ్రామీణ న్యాయ పీఠం ఆధ్వర్యంలో భూన్యాయ శిబిరం ఉంటుందని నిర్వాహకుడు కరుణాకర్‌దేశాయి కేతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సోషల్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ భూ న్యాయ శిబిరానికి ప్రముఖ భూచట్టాల న్యాయ నిపుణులు, సీనియర్ రెవెన్యూ అధికారులు, తెలంగాణ తహసీల్దార్ల సంఘం నేతలు హాజరవుతారని తెలిపారు. యాచారం మండల పరిధిలోని భూ సమస్యలు ఉన్న రైతులు వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపేదలకు అండగా ఉంటా

కాంగ్రెస్ నేత నర్సింహారెడ్డి



భాస్కర్ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సింహారెడ్డి, నాయకులు

మహేశ్వరం: నిరుపేదలకు అండగా ఉంటానని నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేసీ తండాకు చెందిన భాస్కర్‌నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. నర్సింహారెడ్డి గురువారం తండాకు చేరుకుని భాస్కర్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు రాజునాయక్,మహేశ్వరం మాజీ సర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్, నాయకులు మున్యా నాయక్, తారాసింగ్, దశరథ్ నాయక్, రవి నాయక్, రెడ్యా నాయక్, లక్ష్మణ్ నాయక్, రమేష్ నాయక్, బాబు నాయక్, శశికాంత్ నాయక్ పలువురు పాల్గొన్నారు.

వడ్డెర ఫెడరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

సంఘం అధ్యక్షుడు స్వామికుమార్



నిరసన తెలుపుతున్న స్వామికుమార్, సంఘం సభ్యులు

మీర్‌పేట: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల ని ప్రశ్నిస్తే ప్రభుత్వం ముందస్తుగా అరెస్టులు చేయడం సరైంది కాదని వడ్డెర సంఘం బాలాపూర్ మండల అధ్యక్షులు స్వామికుమార్ అన్నారు. బడ్జెట్‌లో వడ్డెర ఫెడరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా గురువారం మీర్‌పేట పోలీసులు సంఘం నాయకులను ముందస్తు హౌస్‌అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్వామికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న వడ్డెరులకు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రభుత్వం అన్నింటా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు, సబ్సిడీ వాహనాలను అందించాలని కోరారు. సివిల్ కాంట్రాక్ట్ రిజర్వేషన్ 5 నుంచి పది శాతానికి పెంచాలని, ముఖ్యంగా వడ్డెర పిల్లల కోసం ఫెడరేషన్ ద్వారా హాస్టల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే ఎమ్మెల్యేలు, మంత్రులను అడుగడుగునా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో నాయకులు బుచ్చిరాములు, శ్రవణ్, ఆంజనేయులు, సతీష్, నరేంద్రబాబు, హనుమంతు, ఈశ్వర్, వెంకటేలు ఉన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ రఘుపతి



అవగాహన కల్పిస్తున్న రఘుపతి

మహేశ్వరం: వంటగ్యాస్‌ను సరైన పద్ధతిలో వాడుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని మహేశ్వరం రూమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని విప్రో కంపెనీలో పనిచేసే మహిళా కార్మికులకు వంట గ్యాస్ వాడకం, సంరక్షణ, ప్రమాద సమయంలో ఎలా వ్యవహరించాలో తెలియజేసేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ... గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ అయినప్పుడు సిలిండర్ లీకేజీ చెక్ చేసి తీసుకోవాలి. సురక్ష రబ్బర్ ట్యూబ్‌లు కాలపరిమితి పూర్తయ్యాక మార్చుకోవాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన స్టౌవ్‌లు, రబ్బర్ ట్యూబ్‌లను మాత్రమే వాడాలి. గ్యాస్ వాసన వచ్చినట్లు అనిపిస్తే వెంటనే 1906 టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ.. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ మహేందర్, దేవేందర్, విప్రో కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 9మంది హాజరు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (2022-23) కింద రుణాల కోసం గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంపీపీ నిర్మల, ఎంపీడీఓ శ్రీకాంత్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్, ఏపీజీవీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ యాదయ్య సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్పొరేషన్ ద్వారా 6యూనిట్ల రుణాల మంజూర్ కోసం 15మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 9 మంది మాత్రమే హాజరయ్యారు. దరఖాస్తుదారుడి వయస్సు, అనుభవం, స్థానికత తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘు, కోఆప్షన్ ఇమ్రాన్, జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

తండా అభివృద్ధికి నిధుల ప్రొసీడింగ్ అందజేత

తలకొండపల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మండలాభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండలంలోని కోరింతకుంటతండా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ స్థానిక నాయకులు జెడ్పీటీసీని గురువారం హైదరాబాద్‌లో కలిశారు. స్పందించిన జెడ్పీటీసీ తండాలో సీసీ రోడ్లు వేయడం కోసం జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్, ఉప సర్పంచ్ రవీందర్, బాలు, సక్రు పాల్గొన్నారు.

పైప్‌లైన్ల మరమ్మతులు చేయించండి

జలమండలి జీఎంకు కార్పొరేటర్ వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం యూజీడీ పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. ఈ మేరకు జనరల్ మేనేజర్ బలరాంకు గురువారం ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. కాలనీల్లో ధ్వంసమైన పైపులు, మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భగత్‌సింగ్‌నగర్, ఇంద్రాహిల్స్, చెరుకుతోట కాలనీ, చౌడీ, బాపూనగర్, అంబేద్కర్‌నగర్, లక్ష్మీనగర్, వేంకటేశ్వరకాలనీ, శ్రీనివాసకాలనీ, ఎస్‌బీఐ కాలనీ, పోచమ్మబాగ్, హుడాకాలనీ, డాక్టర్స్‌కాలనీ, వికాస్‌నగర్ ప్రాంతాల్లో మరమ్మతులతో పాటు కొత్త పైపులైన్ల అవసరం ఉందన్నారు. గతంలో కూడా ఇవే సమస్యలపై పలుమార్లు జలమండలి ఇంజనీరింగ్ అధికారులకు వినతిపత్రం అందజేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

పూాచర్ల కుంటలో ఆక్రమణలు

చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వినతి



అలుగుకు అడ్డుగా నిర్మించిన ప్రహరీ

కందుకూరు: మండల పరిధిలోని గూడూరులోని పూచర్ల కుంట ఆక్రమణలకు గురైయిందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ఎంపీడీఓ వెంకట్రాములు, ఇరిగేషన్ ఏఈ ఆజమ్‌కు వినతిపత్రాలు అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 3, 5లోని పూచర్ల కుంట కట్ట, తూము, అలుగును ఆక్రమిస్తూ ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఫాంల్యాండ్ వెంచర్ చేపట్టిందన్నారు. నీరు పోకుండా మట్టిపోసి ప్రహరీ సైతం నిర్మిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు బావయ్య, శ్రీశైలం, కృష్ణ, కుమార్, జంగయ్య, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధికార ప్రతినిధిగా మల్లేశ్



నియామకపత్రం అందుకుంటున్న మల్లేశ్

మహేశ్వరం: బీజేపీ మండల అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన అల్లంపల్లి మల్లేశ్ నియమితులయ్యారు. గురువారం పట్టణంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్‌ను మండల అధికార ప్రతినిధిగా నియమించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ శర్మ, పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బస్వ పాపయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకుకృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు కడారి జంగయ్య, సుదర్శన్ యాదవ్, అనంతయ్య గౌడ్, మండల అధ్యక్షుడు మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌కు పతనం తప్పదని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ ప్రజాస్వామ్య విలువలు కాలరాస్తూ దోపిడి, నియంత పాలన సాగిస్తుందని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్‌ను సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. హామీలను అమలులో సర్కార్ విఫలమైందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని శక్తి కేంద్రాల్లో ఈనెల 10 నుంచి 25 వరకు బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. కల్వకుర్తి నియోజక వర్గంలోని 95 శక్తి కేంద్రాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని అన్నారు. తొలి సమావేశాన్ని ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్నర్ మీటింగ్‌లలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆచారి కోరారు. సమావేశంలో బీజేపీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ నర్సింహ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ రావ్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, మండల బీసీ మోర్చా అధ్యక్షుడు వరికుప్పల శ్రీను, నాయకులు ఉప్పల నర్సింహ, శ్రీను, శివ, లక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దుచేస్తాం

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఫార్మా చాటున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపణ
- నల్లవెల్లి, మాల్, చింతపట్లలో హాత్ సే హాత్ జోడో యాత్ర



మాల్‌లో పాదయాత్ర చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

యాచారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేయిస్తానని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి, మాల్, చింతపట్ల తదితర గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ... ఫార్మాసిటీ పేరుతో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు రియల్ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలోని తుర్కయంజాల మున్సిపాలిటిలోని పలు గ్రామాల్లో చేసిన హెచ్ఎండీఏ వెంచర్లల్లో రూ.5 వేల కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి స్కాం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ పంట రుణాలకు రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని అన్నారు. గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఉంటే రూ.5 లక్షలు, స్థలాలు లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వమే స్థలాలు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతుందని అన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే అతని కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రగతి నివేదన పాదయాత్ర చేపట్టారని విమర్శించారు.

పార్టీకోసం పనిచేస్తే గుర్తింపు..

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషిచేసే వారికి భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కిషన్‌పల్లి గ్రామంలోని నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో పార్టీలో భారీ ప్రక్షాళన చేస్తానని అన్నారు. పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తానని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, యాచారం మండల మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, మాల్, తాడిపర్తి గ్రామాల సర్పంచులు పడకంటి కవిత, దూస రమేష్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీపతిగౌడ్, జ్యోతినాయక్, నాయకులు రామకృష్ణ, మోటె శ్రీశైలం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం..

మంచాల: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన హాత్‌సేహాత్ జోడో అభియాన్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కూడా పాల్గొని బహుమతులు అందజేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్ రాజు, ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయానందం, పీఏసీయస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్ నాయకులు బుగ్గరాములు, ప్రేమాకర్‌రెడ్డి, చేతల సంజీవ, లింగంగౌడ్, సురేష్, భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శివాలయంలో గురువారం శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు ఆలయంలో శ్రీ గణపతి, భవానీ, రామలింగేశ్వరస్వామి, నందీశ్వరుడు, ధ్వజస్తంబ ప్రతిష్ఠ కార్యక్రమాలను మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన మణికంఠ శివాచార్య మహాస్వామి నేతృత్వంలో స్థానిక పూజారులు మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత రేగట్టి శ్రీనివాసులు, శ్రీలత దంపతులను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్, నర్సింహ, స్థానికులు కండెసాయి, నాగిళ్ల శ్రీను, అశోక్, చంద్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.